

57
ధారావాహిక

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** మూడేళ్ల తర్వాత చూస్తున్న కాకతి.. జాయపకు పరిపూర్ణ యవ్వనవతిగా కనిపిస్తున్నది. ఆమెను కలిశాక.. ప్రపంచమంతా ఆహ్లాదంగా ఉన్నట్లు అనిపించింది జాయపునికి. ఇక్కడే.. మరి కొంతకాలం ఆమె సాన్నిహిత్యంలో ఉండాలనుకున్నాడు. పగలంతా ఒకరికొకరు కనిపించేలా తిరుగుతారు.. దూర దూరంగా - పలకరించుకోకుండా. సంధ్యవేళ ఇద్దరూ కలిసేది, మాట్లాడుకునేది, కబుర్లు కలబోసుకునేది దేవాలయ ప్రాంగణంలో.. భక్తుల సందోహాల మధ్య.

ఒకరోజు అడిగింది..

‘‘అసలు నువ్వు ఆడపిల్లలా ఇంత అందంగా ఎలా పుట్టావ్?’’ అని..

దిగులుగా ముఖం పెట్టాడు జాయప.

‘‘ప్చ్.. ఏమో నాకూ తెలియదు!’’ అన్నాడు బాధగా.

దుఃఖమొక్కటే తక్కువ. ఒక్క లిప్త నిశ్శబ్దం. ఆమె పగలబడి నవ్వింది. అతను శ్రుతి కలిపాడు.. నిశ్శబ్దంగా.

పొలాల వద్ద ఎవ్వరూ లేకుంటే.. ఆమె చెరుకుగడకు ఓణి కొంగు చుట్టి నోటితో ఒలిచి, చెరుకుముక్క అతనికి ఇస్తుంది. ఆ చెరుకుముక్కను అతను రసం పీలుస్తూ.. పూర్తిగా నమిలి నమిలి తింటాడు.

మరునాడు ఆమె అలా చేస్తే.. జాయపుడు బుంగ మూతి పెట్టి చెరుకు ముక్కను తీసుకోలేదు. ఆమె అర్థం చేసుకుంది. అప్పటి నుంచి ఓణి లేకుండానే చెరుకు ముక్క నోటితో కొరికి.. అతనికి అందించగా, ఆనందంగా ఆరగించాడు.

అతను చెమటలు కక్కుతూ రాటనం ఎత్తి నీళ్లు తోడుతున్నాడు. ఆమె గట్టుపై కూర్చుని తాటి తేగలు ఒలుస్తూ ముక్క అతని నోటికి అందిస్తున్నది. నోట్లో పెట్టిన ముక్కను కసిగా నములుతూ.. విరామమెరుగక ఏతాం ఎత్తుతూనే ఉన్నాడు.

వారిద్దరి ముచ్చట్లు మురిపాలు వారివే. అవి పోట్లాటలు కావచ్చు. సరాగాలు కావచ్చు. నాట్య భంగిమలు కావచ్చు.

ఆకాశమూ పృథ్విలా దూరదూరంగా ఉన్నా.. ఏదో తెలియని తియ్యని మెలిక.. ఇద్దరికీ బంధం అవుతున్నది.

తమ ఇద్దరి యుగళగీతం కోసమే జాయపుడు గ్రామం వచ్చాడని ఎవరికివారు భావిస్తుంటే.. పాపం తమ తగవు కోసం రాజకొలువు విడిచి ఇక్కడే ఉన్నాడని గ్రామస్తులు జాయపుణ్ని చూసి జాలిపడుతున్నారు.

‘‘ఎండల్లో తిరిగి నీ శరీరపు బంగారు ఛాయ మెరుపు తగ్గిందంట. ‘ప్చ్.. పాపం’ అని మా అమ్మ అంటున్నది’’ అన్నది కాకతి.. సంధ్యవేళ గుడిలో దీపాలు వెలిగిస్తూ.

అతను నవ్వి..

‘‘ఆ మెరుపు ఆమె కూతురి బుగ్గల్లో దూరి కూర్చుంది కదా!’’ అన్నాడు జాయపుడు.

దీపాల దివ్వెలా వెలుగుతున్న దేవళం.. ఆ భగవంతుడు అంగీకరించినట్లు రెపరెపా నవ్వింది.

ఎవ్వరికీ అనుమానం లేశమయినా రాకుండా మధ్య మధ్య గ్రామపు తగవు అంశం రోజూ ఒక సమయం వారితో చర్చిస్తున్నాడు జాయపుడు. మొదటిరోజూ గ్రామణితో మాట్లాడాడు. ఆయన సమస్య వివరించాడు.

‘‘పెంట స్థల అమ్మకాలలో ప్రతి మాడకు వీసం చొప్పున సొమ్ముతీసి పక్కనపెట్టి, మా ఊరి మైలారదేవుడి గుడికి ఇస్తామని నానాదేశీ పెక్కండ్రు వారు ప్రకటించారు. అయితే ఆ సొమ్ము ఎవరికి చెల్లించాలి అనేది ఇప్పుడు సమస్య..’’ అన్నాడాయన.

తర్వాత మరో పక్షం గడిచాక ‘నానాదేశి పెక్కండ్రు’